క్లుప్తంగా

ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: గూడూరు మండలం రాయవరం గ్రామానికి చెందిన గార్లపాటి అర్జునరావు(72) స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయన వాసవి క్లబ్ వీకేఎస్‌పీ సభ్యుడిగా కొనసాగుతుండటంతో ఆ క్లబ్ ప్రతినిధులు అర్జునరావు కుటుంబ సభ్యులకు రూ.25 వేలను మట్టి ఖర్చులకుగాను ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని అర్జునరావు కుటుంబ సభ్యులకు వాసవిక్లబ్ గవర్నర్ అన్నం సాయి సునీత, పీఆర్వో చిత్తూరు శ్రీనివాసరావు, క్లబ్ జోన్, రీజనల్ సెక్రటరీ అన్నం అశోక్, క్లబ్ ప్రెసిడెంట్ జల్లూరి రాంబాబు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యెండూరి సురేష్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాకుళపు రేణుకారాణి, క్లబ్ కార్యదర్శి జయవరపు ప్రసాద్, సెంటిల్ కుమార్ (తమిళనాడు) అందజేశారు.

విశేష పూజలు



చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామివారి ఆలయంలోని శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కృత్తిక సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు అలంకారాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాను నంబూద్రి ఆధ్వర్యంలో స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. కృత్తికా నక్షత్రం సందర్భంగా భక్తులు ఆలయానికి వచ్చి సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు జరిపించారు.

మరియమ్మ కుటుంబానికి పరామర్శ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 19వ డివిజన్ రైలుపేటకు చెందిన జంపా మరియమ్మ (80) సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) ఆమె నివాసం వద్ద ఉన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మరియమ్మకు పేర్నికిట్టుతో పాటు ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూరగ రామారావు నివాళులు అర్పించి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు 36 మంది గైర్హాజరు



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్‌లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 179 మందికి గాను 143 మంది హాజరయ్యారని, 36 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



చల్లపల్లి: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై రూ.3లక్షలు ఆస్తినష్టం సంభవించిన ఘటన మండల పరిధిలోని వెలివోలు గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సీ ఏరియాకు చెందిన కొడాలి ఝాన్సి కూరగాయలు తరిగే పనికి వెళుతుంటుంది. రోజూలాగానే పనికి వెళ్లగా ఇంటిలోపల ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. మొవ్వ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఇంటిలోని వస్తువులు, ఆభరణాలు అన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో ఝాన్సి కట్టుబట్టలతో మిగిలింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సుమారు.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

నత్తనడకన కౌలు కార్డుల జారీ

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా 50 శాతం కూడా జారీ కాని దుస్థితి
- పెడన నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది లక్ష్యం 8,775 కార్డులు
- ఇప్పటికి జారీ చేసిన కార్డులు 3,304 మాత్రమే
- ఆందోళనలో కౌలు రైతులు



సాగుకు సిద్ధమవుతున్న కౌలు రైతు

పెడన: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కానీ కౌలు రైతులకు ఇంకా గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆగస్టు వరకు గడువు ఉందని కార్డుల జారీ నిలిపివేశారు. వాస్తవంగా సీజన్ ప్రారంభానికి ముందుగానే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసి కౌలు రైతులకు అందజేయాల్సి ఉంది. సీజన్ ప్రారంభించి నెలలు గడిచినా తరువాత ఇస్తే ఫలితం ఏముంటుందని కౌలు రైతులు ప్రశ్నిస్తున్నారు.

సమయానికి ఇస్తే..

సీజన్ ప్రారంభానికి ముందుగా గుర్తింపు కార్డులు ఇస్తే సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలు, మట్టి పరీక్షలు, సబ్సిడీ విత్తనాలు తెచ్చుకునేందుకు ఉపయోగపడతాయి. ఇది తెలిసీ ఆలస్యం చేయడం అన్యాయమని కౌలు రైతులు వాపోతున్నారు.

రెండు సీజన్‌లకూ నిరుపయోగం

కౌలు గుర్తింపు కార్డు గత ఏడాది ఖరీఫ్‌కు ఉపయోగపడితే మళ్లీ ఈ ఖరీఫ్‌కు ఉపయోగపడదు. కానీ అధికారులు జారీ చేసే కౌలు గుర్తింపు కార్డులకు గత ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరువాత జారీ చేస్తుండటంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు కూడా సమయం ఉండటంతో రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. గత ఏడాది ఇచ్చిన గుర్తింపు కార్డులను తీసుకువెళ్తే ఈ కార్డు పనిచేయదనే సమాధానం వీఏఏలు, ఎంపీవోలు పేర్కొవడంతో చేసేదేమీ లేక కొత్త కార్డు ఎప్పుడు వస్తుందా అని కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా కార్డులు జారీ ఇలా...

పెడన నియోజకవర్గంలోని మండలాల వారీగా గత మూడేళ్లుగా సాగుకార్డులను, ఈ ఏడాది లక్ష్యం, ఇప్పటి వరకు జారీ చేసిన కార్డులను పరిశీలిస్తే..

మండలం	2022	2023	2024	2025 లక్ష్యం	ఇచ్చినవి
బంటుమిల్లి	1,365	1,218	1,500	1,675	800
కృత్తివెన్ను	1,015	920	940	1,300	950
గూడూరు	2,212	2,071	2,500	2,800	854
పెడన	2,497	2,379	2,800	3,000	800
మొత్తం	7,089	6,588	7,740	8,775	3,304

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో

2023లో ఖరీఫ్‌కు ముందుగానే అంటే ఏప్రిల్‌లోనే కౌలు రైతుల గుర్తింపు కార్డులను జారీని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. రైతులకు గుర్తింపు కార్డులను లామినేషన్ చేసిన వాటిని అందజేసింది. గత ఏడాది 2024లో సార్వత్రిక ఎన్నికల వల్ల తీవ్ర జాప్యం ఏర్పడింది. మరి ఈ ఏడాది ఎటువంటి అవాంతరాలు లేకపోయినా జాప్యం జరగడంపై కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సాకులు ఎందుకో..

కార్డు పరిమితి 11 నెలలు మాత్రమే. గత ఏడాది తీసుకున్న గడువు పూర్తికాలేదనే సాకును అధికారులు చూపిస్తూ కాలయాపన చేయడం సబబు కాదని కౌలు రైతులు వాపోతున్నారు. సీజన్ ప్రారంభంలో ఇచ్చి 11 నెలలు గడువు పెడితే సరిపోతుందని, గత ఏడాది ఆలస్యమైందని పేర్కొంటూ అప్పటి వరకు గడువు ఉందని చెప్పడం సరికాదంటున్నారు. ప్రస్తుతం వైట్ పేపరుపై మాత్రమే గుర్తింపు కార్డుల వివరాలను కంప్యూటర్ ద్వారా ప్రింట్ వేసి ఇస్తుండటం వల్ల 11 నెలలు పాటు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని కౌలు రైతులు వాపోతున్నారు.

నిర్ణీత గడువు తీరిన తరువాతే జారీ



కౌలు రైతులకు సాగు కార్డులు జారీ విషయంలో చాలా కార్డులకు ఇంకా గడువు తీరలేదు. 11 నెలలు కాలపరిమితికి గత ఏడాది జారీ చేసినవి ఉన్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియతో ఇచ్చినవి కాబట్టి వాటి గడువు తీరిన తరువాతే కొత్తవి జారీ చేయాలి. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా ఆలస్యంగా జారీ అయ్యాయి. కాల పరమితి కూడా ముందుకు జరిగి కౌలుగుర్తింపు కార్డులు జారీ ఆగస్టు వరకు పెరిగింది. వీఆర్వోలు, ఆర్‌ఎస్‌కేలలోని వీఏఏలు, ఎంపీఈవోలు సమన్వయంతో వీటిని జారీ చేస్తారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడం జరుగుతుంది.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2025కు నందమూరు ఎంపిక



పెడన: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ–2025కు (గతంలో ఓడీఎఫ్ ప్లస్) పెడన మండలం నందమూరు గ్రామం ఎంపికైందని డెప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆయన గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితర శాఖల అధికారులతో కలిసి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025పై సమీక్షించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశీలించి నివేదికలు తయారు చేయా లన్నారు. ప్రత్యేక బృందం సర్వే చేయడానికి వస్తున్న నేపథ్యంలో ఏమైనా పూర్తి చేయాల్సి ఉంటే వాటిని తక్షణం పూర్తి చేయాలన్నారు. ఎంఈవో-2 హరనాథ్, వెలుగు ఏపీఎం శ్రీదేవి, హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొడాలి(ఘంటసాల): ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులందరూ సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్- 2025 అవార్డు సాధ్యమని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. కొడాలి సచివాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో 54 గ్రామ పంచాయతీలను కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్- 2025కు ఎంపిక చేయగా వాటిలో కొడాలి గ్రామ పంచాయతీ ఉందన్నారు. కేంద్రం నుంచి త్వరలోనే ఒక బృందం వచ్చి పరిశీలిస్తుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి అవార్డు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సర్పంచ్ చలపాటి రాణి, ఉప సర్పంచ్ తుమ్మల శంకరరావు, పంచాయతీ కార్యదర్శి నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ యువనేత వికాస్



అవనిగడ్డ మాట్లాడుతున్న యువనేత వికాస్, పలు విభాగాల నాయకులు

అవనిగడ్డ: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన 'యువత పోరు'కు యువనేత సింహాద్రి వికాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా యువనేత వికాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వలేదని, సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని వికాస్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి బాలు, వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోవారి పూర్ణసాగర్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒడుగు నరేంద్ర, నియోజవర్గ కన్వీనర్ చింతలపూడి బాలు, నాగాయలంక మండల కన్వీనర్ రేమాల నాగరాజు, సాంస్కృతిక విభాగం నియోజకవర్గ కన్వీనర్ యాసం శివ, నియోజకవర్గ బీసీ కన్వీనర్ కోలా హరి, కృష్ణా జిల్లా ఆర్‌టీఐ విభాగం జిల్లా కన్వీనర్ పొనమాల నాగరాజు, దివ్యాంగుల విభాగం జిల్లా కన్వీనర్ శ్యామ్యూల్, నాయకులు అయ్యప్ప, రంగనాథ్, తండు రమేష్, పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

వీఏఏలు, ఎంపీఈవోలతో ఎంఏవో జెన్నీ



నూతన ఎంఏవో జెన్నీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఏఏలు, ఎంపీఈవోలు

పెడన: ఇప్పటి వరకు మండలంలో నెలకొన్న వ్యవసాయ స్థితిగతులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని, ఆ పరిస్థితి రానీయకుండా అంతా సమన్వయంతో కలిసి వ్యవసాయశాఖకు మంచి పేరు తీసుకువద్దామని మండల వ్యవసాయశాఖాధికారిణి సజ్జా జెన్నీ అన్నారు. సోమవారం మండలంలోని వీఏఏలు, ఎంపీఈవోలు ఆమెకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం మండలంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. పీజీఆర్‌ఎస్ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ సూచించిన పలు విషయాలపై సిబ్బందితో చర్చించారు. ఉన్నతాధికారులు సమాచారం కోరిన వెంటనే అందించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలని, నిర్ణీత సమయంలో బాధ్యతలను పూర్తి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో వీఏఏలు, ఎంపీఈవోలు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలో లేదా జిల్లా కేంద్రంలో ఆఫీసు పని నిమిత్తం సమావేశాలున్నా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి, సచివాలయం అడ్మిన్‌కు, అక్కడ ఉండే వారికి తెలియజేయాలన్నారు. రైతులకు తెలిసే విధంగా సమాచారం ఇచ్చి రావాల్సిందిగా సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండటం లేదనే మాట పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధ్యతల విషయంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఇక నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, ఆ విధంగా అందరం కలిసి సమన్వయంతో ముందుకు వెళ్దామని తెలిపారు.

స్వచ్ఛ చల్లపల్లి సేవలు స్ఫూర్తిదాయకం



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ వనజాక్షి, ఎంపీడీవో, స్వచ్ఛ కార్యకర్తలు

చల్లపల్లి: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని తహసీల్దార డి.వనజాక్షి, ఎంపీడీఓ ఎ.వెంకటరమణ అన్నారు. సోమవారం సాయంత్రం స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. 216 జాతీయ రహదారి వెంబడి మామిడి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాధ్యమైనన్ని మొక్కలు నాటాలని కోరారు. ఇప్పటి వరకూ చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో 30 వేల మొక్కలకు పైగా నాటి వాటిని పరిరక్షిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులను అభినందించారు. అనంతరం 'ఇదే మన స్వచ్ఛ సుందర చల్లపల్లి' బోర్డులను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్ర రావు, స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారధి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ రావు, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు. చల్లపల్లి–అవనిగడ్డ రోడ్డులో కాసానగరం వద్ద కాల్చివేసిన చెట్లను, చల్లపల్లి– పామర్రు రోడ్డులో నరికివేసిన చెట్లను తహసీల్దార్ పరిశీలించారు.

అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలకు వినతి



మోపిదేవిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన రామాంజనేయులు

మోపిదేవి: ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీవిద్యను కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచి కోసూరు రామాంజనేయులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఉపాధి సిబ్బంది చేసిన తప్పులను గుర్తించారని తెలిపారు. పేద ప్రజలు ఉపాధి పనులు చేసుకుంటుంటే అందులోనూ అధికారులు అవినీతికి పాల్పడి కూలీలకు అన్యాయం చేశారని తెలిపారు. అవినీతికి పాల్పడినవారిని విధుల నుంచి తొలగించకపోతే అలాంటి వారికి అధికారుల ప్రోత్సాహం ఉందని ప్రజలు అనుమానించాల్సి ఉంటుందన్నారు. అవినీతికి పాల్పడిన వారిని విధుల నుంచి తొలగించి తమ చిత్తశుద్ధిని చాటాలని వినతిపత్రంలో కోరారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

పెడన: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెడన పట్టణ కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ఉపాధ్యక్షులుగా జఫ్రుల్లా బాషా, గరికిముక్కు సత్యనారాయణలను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా తాళ్ల బాలాజీ, కోమట్ల శ్రీనివాసరావు, పడమట జగన్మోహనరావు, నూలు శ్రీనివాసరావు, హాఫీజ్ మహమ్మద్‌లను, సెక్రటరీలుగా రావూరి వీరభద్ర, అబ్దుల్‌మజీద్ (మున్నా), చెన్నూరి పైడేశ్వరరావు, అబ్దుల్ ఇబ్రహీం, పేరిశెట్టి ముక్తేశ్వరరావులను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఊటుకూరి విజయలక్ష్మి, బళ్ల నాగేశ్వరరావు, ముస్తాఫా, నయాజ్‌ఖాన్, మల్ల ఆంజనేయులు, బీఎన్ చంద్రరావు, బట్టా దుర్గాశంకర్, దాసరి కమలకుమారి, కుర్మా సుజాత, కోరుమిల్లి సిద్దు, బసవ ఉమామహేశ్వరరావు, నెహామత్, కె.ప్రశాంత్, మహమది, తాళ్ల రాజు, చిల్లిముంత పైడేశ్వరరావు, దుర్గా నాగేశ్వరరావు, శిరివెళ్ల సూర్యనారాయణ, జోగి రమేష్, కుర్మా లక్ష్మీనారాయణ, బట్ట రాజేష్, ఎండీ రిజ్వాన్, మామిడి హరికృష్ణలను నియమించారు.

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వైఎస్సార్ సీపీ నూతన కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక వివరాలను వెల్లడించారు.

అవనిగడ్డ మండలంలో

అవనిగడ్డ మండల ఉపాధ్యక్షులుగా బొర్రా రామకృష్ణ, గార్లపాటి గోపాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శులుగా చింతలపూడి సుబ్రహ్మణ్యం, విస్సంశెట్టి వెంకట మునేశ్వరరావు, కోట సాంబశివరావు, యలవర్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీలుగా సింహాద్రి రామచంద్రరావు, నల్లూరి శ్రీనివాసరావు, బచ్చు సీతారామాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సనకా లక్ష్మి శివకన్య, నాదెండ్ల పోతరాజు, గవిని భరత్‌కుమార్, నలుకుర్తి వెంకటేశ్వరరావు, బందెల రాజమోహనరావు, పద్యాల శివకుమార్, అందె వెంకట సుబ్బారావు, తుంగల శ్రీనివాసరావు, కోసూరు వెంకయ్య, బచ్చు మురళీకృష్ణ, దిడ్ల ఆనందబాబు, రేపల్లె సురేంద్ర, బాస కిశోర్, సనకా భాస్కర శ్రీనివాసరావు, మాతంగి దిలీప్‌కుమార్, పక్కెల కృష్ణ, అసలేటి అంజి, మద్దాల పెదనాగయ్య, చందు వెంకటేశ్వరరావు, నలుకుర్తి గణేష్‌ని నియమించారు.

నాగాయలంక మండలంలో..

గౌరవ అధ్యక్షుడిగా రేపల్లె రామమోహనరావు, ఉపాధ్యక్షులుగా నాయుడు అంకరాజు, వల్లభనేని వసంతరావు, ప్రధాన కార్యదర్శులుగా చింతా పాపారావు, దాసి జీవరత్నం, బుడిపల్లి బసవయ్య, పూషడపు అంకాలు, కార్యదర్శులుగా కొప్పనాతి వెంకటేశ్వరరావు, సైకం వసంతరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చాట్రగడ్డ భరత్, పెనుమూడి జయంతరావు, లంకె రాంబాబు, కమ్మిలి బ్రహ్మయ్య, బండ్రెడ్డి శేషుబాబు, ధీకొల్లు వెంకటేశ్వరరావు, చెన్ను నాగపుష్పారావు, కొక్కిలిగడ్డ ఇస్రాయేల్, ఆరేపరపు నాగేశ్వరరావు, మలిశెట్టి మధుసూధనరావు, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, ఒడుగు ప్రసాద్, కొక్కిలిగడ్డ వీరరాఘవయ్య, చోడిశెట్టి ప్రసాద్, బొండాడ వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి బసవారావు, పీతా పార్థసారథిని నియమించారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్వహించాలి

కొడాలి(ఘంటసాల): డ్రెయినేజీ పనులను నాణ్యతతో నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొడాలి వద్ద గుండేరు మేజర్ డ్రెయినేజీ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నిధులు రూ.38.62 లక్షలతో కొడాలి నుంచి అచ్చెంపాలెం పరిధిలో ఉన్న డ్రెయినేజీలో పూడిక తీసి కట్టలు బలోపేతం చేసే పనులు చేపట్టామన్నారు.

శ్రీకాకుళం కృష్ణానదిలో ఇటీవల ప్రమాదవశాత్తూపడి మరణించిన యువకుడు ఆత్కూరి ఫణికుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పరామర్శించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ ఎ.భాను ప్రకాష్, డ్రెయినేజీ డీఈఈ జే బాబూ నాయక్, ఏఈఈ చిరంజీవి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



పీజీఆర్‌ఎస్‌కు కొందరు అధికారుల డుమ్మా



పీజీఆర్‌ఎస్‌కు హాజరైన అధికారులు



బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో..

పెడన: ఎన్డీయే కూటమి ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా ప్రజావిజ్ఞప్తుల వినతి పత్రాలు స్వీకరణ (పీజీఆర్‌ఎస్)కు మండల స్థాయిలో అధికారులు డుమ్మా కొడుతున్నారు. ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని అధికారులు ముగ్గురు లేదా ఐదుగురు హాజరవుతున్నా మిగిలిన కొన్ని శాఖల అధికారులు రావడం లేదు సరికదా ఆ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వారెవరూ హాజరుకావడం లేదు. వెళ్లి కూర్చుని రావడమే కదా అనే భావనలో వీరున్నట్లుగా తెలుస్తోంది. ఈ సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు ఇన్‌చార్జి తహసీల్దారు, ఎంఈవో- 2, పీఆర్ ఏఈ, వ్యవసాయశాఖ ఏవో, ఐసీడీఎస్, మెడికల్, మున్సిపల్ అధికారులు మినహా మిగిలిన శాఖలకు చెందిన వారెవరూ హాజరుకాలేదు. విద్యుత్, గ్రామీణ నీటిపారుదల, పోలీస్, ఎక్సైజ్, డ్రెయినేజీ, వెలుగు, మెప్మా, హౌసింగ్, ఆర్.అండ్ బీ, ఫిషరీస్ తదితర శాఖలకు చెందిన వారెవరూ రాలేదు. ఇక నుంచి మేం కూడా రాకపోయినా పర్వలేదన్నట్లుగా పరిస్థితి మారుతుందనే వాదన వినిపిస్తోంది. ఈ పరిస్థితి రాకముందే ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రీవెన్స్‌కు హాజరవుతున్న పలువురు కోరుతున్నారు.

బంటుమిల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు తహసీల్దార్ కార్యాలయంలో 23 శాఖల అధికారులు పాల్గొనవలసి ఉండగా చాలా మంది అధికారులు డుమ్మాకొట్టారు. తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ నీరజాక్షి, ఏపీఎం దశరథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే పాల్గొన్నారు. ఎంపీడీఓ పని ఉందని సంతకం చేసి వెంటనే వెళ్లిపోయారు. దీనిపై తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎవరికివారు వారి పరిధిలో ఉన్న కార్యాలయాల్లో పీజీఆర్‌ఎస్‌లో పాల్గొంటున్నారని సమర్థించారు. మండల స్థాయిలో జరిగే మీ కోసం కార్యక్రమానికి అధికారులు పాల్గొని కార్యక్రమ ఉద్దేశ్యాన్ని నెరవేర్చి ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ ఈఓ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా జీవీ కృష్ణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణారావు ప్రస్తుతం విజయవాడలోని శ్రీ శనీశ్వరస్వామి ఆలయ ఈఓగా పని చేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఈఓ సమ్మెట ఆంజనేయస్వామి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆంజనేయస్వామి రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. కృష్ణారావును ఆలయ వంశపారంపర్య చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఆలయ స్థానాచార్యులు ముత్తేవి శశికాంత్, అన్నంభట్ల బ్రహ్మానందశాస్త్రి పూలమాలలు వేసి, శాలువాకప్పి సత్కరించారు.

డాక్యుమెంట్లు పోయినవి

బండ్రెడ్డి లక్ష్మీశేషుకుమారి W/o. బస్వారావు (ఆధార్ : 2277 6517 1001) డోర్ నెం. 4-108, నాగాయలంక, నాగాయలంక మం॥, కృష్ణాజిల్లా అను నాకు చెందిన ఒరిజినల్ దస్తావేజు డాక్యుమెంట్ నెం. 1143/1997, 2828/2021, 29-09-2021న నాగాయలంక నుండి అవనిగడ్డకు బస్సులో ప్రయాణం చేస్తుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికిన వారు ఈక్రింది నెంబరుకు తెలుపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

☎ 94908 36297

వరల్డ్ బుక్ఆఫ్ రికార్డు ధ్రువీకరణ పత్రం అందుకున్న కలెక్టర్ బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): కూచిపూడి నృత్యబంగిమలో యోగా కార్యక్రమం నిర్వహించినందుకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వరల్డ్ బుక్ఆఫ్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం రాత్రి అందించారు. వెలగపూడిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు సదస్సులో భాగంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని కూచిపూడిలో కూచిపూడి నృత్య భంగిమలో యోగా కార్యక్రమం నిర్వహించారు. వినూత్న రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు కలెక్టర్ బాలాజీకి సీఎం చంద్రబాబు ఈ పత్రాన్ని అందించి అభినందించారు. డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎస్పీ ఆర్.గంగాధరరావు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.